సాక్షి
నల్లగొండ

బుధవారం । 24 । జూలై । 2024




ప్రాజెక్టులు పూర్తి చేయాలి

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. - IIలో



గంజాయి పట్టివేత

గంజాయి విక్రయించేందుకు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని పెన్‌పహాడ్ పోలీసులు అరెస్ట్ చేశారు. - IIలో



గుప్తనిధుల కోసం తవ్వకాలు?

నందికొండ మున్సిపాలిటీ మత్స్యకారుల కాలనీలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు పోలీసులు భావిస్తున్నారు. - IIలో

న్యూస్‌రీల్

26న కార్గిల్ సిల్వర్ జూబ్లీ విజయ్ దివస్

నల్లగొండ రూరల్: కార్గిల్ సిల్వర్ జూబ్లీ విజయ్ దివస్‌ను ఈ నెల 26న నల్లగొండ పట్టణంలోని పానగల్ రోడ్డులో గల రీజనల్ సైనిక్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంది పాపిరెడ్డి, కొల్లోజు వెంకటాచారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలోని మాజీ సైనికులు, అమరులైన, మరణించిన సైనికుల కుటుంబ సభ్యులు హాజరుకావాలని కోరారు.

రేపు ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్ తయారీపై వర్క్‌షాప్

నల్లగొండ: పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వ శాఖ ఢిల్లీ పర్యవేక్షణలో నేషనల్ గ్రీన్‌కార్ప్స్ ఆధ్వర్యంలో ఎంపిక చేయబడిన 50 పాఠశాలల విద్యార్థులకు గురువారం ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్ తయారీపై వర్క్ షాపు నిర్వహించనున్నట్లు డీఈఓ భిక్షపతి మంగళవారం తెలిపారు. పూర్తి వివరాలకు సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి 98485 78845 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా రమణమూర్తి

నల్లగొండ టౌన్: నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ రమణమూర్తి నియామకమయ్యారు. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ నిత్యానంద హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రమణమూర్తిని ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మెడికల్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా రాధాకృష్ణ

నల్లగొండ మెడికల్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాధాకృష్ణ నియామకమయ్యారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్ రాజకుమారి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి బదిలీ అయ్యారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

మత్స్యశాఖ జిల్లా అధికారిగా నర్సింహారావు

నల్లగొండ టూటౌన్: మత్స్యశాఖ జిల్లా అధికారిగా నర్సింహారావు బదిలీపై నల్లగొండ జిల్లాకు రానున్నారు. మెదక్‌లో పని చేస్తున్న ఆయనను నల్లగొండకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న వెంకయ్య వికారాబాద్‌కు వెళ్లారు.

ఆంజనేయస్వామికి ఆకుపూజ

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో మంగళవారం ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించారు. ప్రధానాలయంతో పాటుగా, విష్ణు పుష్కరిణి వద్ద, పాత గుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకాలు చేశారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. ఇక స్వయంభూవులకు, నిత్యపూజలు చేపట్టారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించారు. సాయంత్రం జోడు, వెండి సేవలను ఘనంగా నిర్వహించారు.



మీట్ యువర్ ఎస్పీ

నేడు నాగార్జునసాగర్ పోలీస్ స్టేషన్‌లో ప్రారంభం

- ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి అక్కడే పరిష్కరిస్తాం
- ప్రతి నెలా రెండు మూడు స్టేషన్లలో..
- గంజాయిపై ఉక్కుపాదం

'సాక్షి'తో జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ''మారుమూల ప్రాంతాల్లోని ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై స్థానిక పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేయలేని వారు, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేసేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రజలు వ్యయ ప్రయాసలకోర్చి రావాల్సిన అవసరం లేకుండా, వారు ఎదుర్కొనే సమస్యలను స్థానికంగా పరిష్కరించేందుకు 'మీట్ యువర్ ఎస్పీ' కార్యక్రమం నిర్వస్తున్నాం..'' అని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ చెప్పారు. 24వ తేదీ బుధవారం మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్న నేపథ్యంలో ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. కార్యక్రమానికి సంబంధించిన పలు అంశాలను వెల్లడించారు.

ప్రతి నెలా రెండు మూడు మండలాల్లో కార్యక్రమం

మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమాన్ని ఈ నెల 24న నాగార్జునసాగర్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఆ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు సమస్యలపై నేరుగా తనను కలిసి ఫిర్యాదు చేయొచ్చని వెల్లడించారు. నాగార్జునసాగర్ పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభించే ఈ కార్యక్రమాన్ని ఇకపై ప్రతి నెలా రెండు మూడు మండలాల్లోని పోలీస్ స్టేషన్లలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలపై ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రతి సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి యథావిధిగా ఉంటుందని, దీనికి అదనంగా ప్రజల వద్దకు వెళ్లి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. దీనిద్వారా ఆయా మండలాల్లో ప్రజలు ఏయే సమస్యలు ఎదుర్కొంటున్నారు.. పోలీస్ స్టేషన్లకు ఏయే ఫిర్యాదులు వస్తున్నాయి.. అనే విషయాలను తెలుసుకోవడంతోపాటు వీలైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించనున్నట్లు వివరించారు.



నాగార్జునసాగర్ పోలీస్ స్టేషన్

గంజాయి అరికట్టడంపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించామని, ఇందులో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వెల్లడించారు. జిల్లాలో ఇప్పటికే పెద్ద ఎత్తున గంజాయి రవాణాను అడ్డుకొని, పట్టుకున్నామని తెలిపారు. నల్లగొండ పట్టణంతోపాటు మండలాల్లోనూ గంజాయి రవాణా చేసే వారు, విక్రయించే వారు, వినియోగించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా మిర్యాలగూడ, చండూరు మండలాల్లో 60 మంది గంజాయి వినియోగదారులను పట్టుకున్నామని, అందులో యువత ఎక్కువ మంది ఉన్నట్లు తెలిపారు. గంజాయి వినియోగాన్ని అరికట్టేలా వారిలో పరివర్తన తీసుకువచ్చేందుకు వారికి నల్లగొండ పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. వారితోపాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. జిల్లాలో రేషన్ బియ్యం దందాపైనా ప్రత్యేక దృష్టి పెట్టామని, రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికడుతున్నామని పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నాగార్జునసాగర్: ప్రజల వద్దకే వచ్చి సమస్యలు పరిష్కరించే దిశగా బుధవారం నాగార్జునసాగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ శరత్‌చంద్రపవార్ 'మీట్ యువర్ ఎస్పీ' కార్యక్రమం నిర్వహిస్తున్నారని సాగర్ ఎస్‌ఐ సంపత్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని నాగార్జునసాగర్, పెద్దవూర మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

సాధారణంగానే..!

కేంద్ర బడ్జెట్‌లో మెరుపులేమీ లేవంటున్న ఆర్థిక విశ్లేషకులు

- వ్యవసాయరంగానికి, చిన్న పరిశ్రమలకు ప్రాధాన్యంతో కొంత ఊరట
- యాంత్రీకరణతో ఉమ్మడి జిల్లా రైతులకు ప్రయోజనం
- పీఎంఏవై అమలు చేస్తే 7.50 లక్షల మందికి మేలు
- ఆదాయ పన్నులో మార్పులేమీ లేకపోవడంతో నిరాశ
- ముద్ర రుణాల పరిమితి రెట్టింపుతో స్వయం ఉపాధికి ఊతం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి, జిల్లాకు నేరుగా ఎలాంటి ప్రయోజనం లేకున్నా.. పరోక్షంగా రైతులు, యువతకు మేలు చేకూరనుంది. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో యాంత్రీకరణ, పంటలకు మద్దతు ధర పెరిగే అవకాశముంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) ఊతం కానుంది. నిరుద్యోగులకు మూడు ఉద్యోగ అనుసంధాన ప్రోత్సాహకాలు ప్రకటించడంతో జిల్లా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇక ఎలాంటి గ్యారెంటీలు లేకుండా బ్యాంకుల ద్వారా అందిస్తున్న ముద్ర రుణాలను రూ.10 లక్షల నుంచి రూ.20లక్షల వరకు పెంచడంతో స్వయం ఉపాధి రంగంలో ముందుకు సాగుతున్న వారికి దన్నుగా నిలవనుంది.



వ్యవసాయ, అనుబంధ రంగాలకు నిధులు

వ్యవసాయ రంగానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చింది. వ్యవసాయం, అనుబంధ రంగాలకు అధిక నిధులు ఇవ్వడంతో యాంత్రీకరణ వైపు అడుగులు వేసే అవకాశముంది. ఏటా పంటల మద్దతు ధరను పెంచుతుండగా.. ఈ బడ్జెట్‌లోనూ ప్రతిపాదనలు చేయడం నల్లగొండ జిల్లాలోని 6.42 లక్షల మంది, సూర్యాపేట జిల్లాలో 4.60 లక్షల మంది రైతన్నలకు ఆసరా కానుంది. రాష్ట్రంలో గత ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణను దాదాపుగా పక్కనపెట్టింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం యాంత్రీకరణను పక్కాగా అమలు చేస్తే కేంద్ర సహాయం రైతులకు అందనుంది. పురుగుల మందుల ధరలు కొంతమేర పెరుగనున్నాయి. ఇది రైతులకు కొంత భారం కానుంది. కిసాన్ సమ్మాన్ నిధిని రూ.8వేలకు పెంచుతారని ప్రచారం జరిగినా.. ఈ పథకం యథావిధిగానే కొనసాగనుంది.

పేద కుటుంబాలకు సొంతిళ్లు




కేంద్రం ప్రభుత్వం ఏటా ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లు నిర్మిస్తోంది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం కొన్ని నిబంధనలు విధిస్తుండగా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేయలేదు. డబుల్‌బెడ్ రూం ఇళ్లను నిర్మించింది. దీంతో కేంద్రం నుంచి ప్రజలు పెద్దగా ప్రయోజనం పొందలేకపోయారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం కింద అర్హుల గుర్తింపు నుంచి మొదలుకొని అన్ని కేంద్ర నిబంధనలను అమలు చేస్తే రెండు జిల్లాల్లోని దాదాపు 7 లక్షల మంది నిరుపేదలకు సొంతింటి కల నెరవేరే అవకాశం ఉంది.

నిరుద్యోగుల్లో ఆశలు



కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రత్యేకంగా ఉద్యోగాల కల్పనకు నడుం బిగించింది. దేశంలో నిరుద్యోగ శాతాన్ని తగ్గించేందుకు నిరుద్యోగులకు మూడు ఉద్యోగ అనుసంధాన ప్రోత్సాహకాల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని దాదాపు 2.5 లక్షల మంది నిరుద్యోగుల్లో ఉద్యోగాలపై ఆశలు రేకెత్తాయి. ఈ పథకంలో జిల్లాల్లోని 20 శాతం మేర నిరుద్యోగులకు లబ్ధి జరగనుంది.

ఎంఎస్ఎంఈలకు మేలు



సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులను కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ ఏడాది ఈ రంగానికి భారీగా నిధులు ఇవ్వనుండడంతో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో 40 వేలకు పైగా ఉన్న ఎంఎస్ఎంఈలకు మరింత మేలు చేకూరనుంది. కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారికి ప్రయోజనం కలుగనుంది. కరోనా సమయంలో దివాలా తీసి ఆర్థికంగా ఇబ్బంది పడిన ఈ రంగంలోని వారంతా కోలుకోనున్నారు.

వేతన జీవులకు కొద్ది మేర ఊరట



ఆదాయ పన్ను స్లాబులో చిన్న పాటి మార్పులతో ఉద్యోగులకు కొంతమేర ఊరట లభించనుంది. అయితే ఆశించిన స్థాయిలో వెసలుబాటు కల్పించకపోవడంపై ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. పన్ను మినహాయింపును రూ.7 లక్షలకు పెంచాలని కోరుతున్నా దానిని పట్టించుకోకపోవడంతో ఉద్యోగుల కోసం పెద్దగా చేసిందేమీ లేదని చెబుతున్నారు.

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ప్రాధాన్యం ఇచ్చారు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గ్రామీణ అభివృద్ధితో పాటు వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇచ్చింది. ఉద్యోగులకు స్లాబ్ పరిధిని పెంచడం కొద్దిగా ఊరటనిచ్చింది. కానీ మరింత స్లాబ్ పెంచితే బాగుండేది. విద్యారంగానికి ప్రాధాన్యం కల్పించలేదు. 25 శాతం బడ్జెట్ కేటాయిస్తే విద్యా వ్యవస్థకు ప్రయోజనకరంగా ఉండేది.

-డాక్టర్ అంజిరెడ్డి, అర్థశాస్త్ర విభాగం అధిపతి, ఎంజీ యూనివర్సిటీ

వ్యవసాయరంగానికి ప్రాధాన్యం దక్కింది



కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.లక్షా 52వేల కోట్లు కేటాయించడం వల్ల దేశంలో అధిక జనాభా ఆధారపడిన వ్యవసాయ రంగానికి ఊతమిచ్చినట్లయింది. 3శాతం వడ్డీతో విద్యారుణాలు, ఉద్యోగ కల్పన పథకాలు, స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టి పెట్టడం ఆహ్వానించదగ్గ పరిణామాలు. రైతులు, మహిళలు, నిరుపేదల అభివృద్ధిపై బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించారు. పన్ను మినహాయింపును రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచకపోవడం ఉద్యోగుల్లో నిరాశ కలిగించింది.

-బడుగుల సైదులు, ఆర్థిక విశ్లేషకుడు, కోదాడ

ఇది సమన్వయ బడ్జెట్



అభివృద్ధి సంక్షేమాలను సమన్వయం చేయడానికి కేంద్ర బడ్జెట్ ప్రయత్నించింది. నూతన పన్ను విధానంలోని స్లాబ్ రేట్లు మార్చడం, స్టాండర్డ్ డిడక్షన్స్ రూ.50 వేల నుంచి రూ.75 వేలకు పెంచడం వేతన జీవులకు కంటితుడుపు చర్య వంటిది. పాత పన్ను విధానంలో ఎలాంటి మార్పులు చేయకపోవడం అందరినీ కొత్త పన్ను విధానంలోకి తీసుకొచ్చే ప్రయత్నంగా కనిపిస్తోంది. పాత పన్ను విధానంలోని పొదుపు రాయితీలను, గృహ రుణ మినహాయింపులను కొత్త పన్ను విధానంలో కూడా ప్రవేశపెడితే జాతీయ పొదుపు పెరిగి ఆర్థిక అభివృద్ధికి భరోసానిస్తుంది.

- చందా అప్పారావు, అర్థశాస్త్ర సహాయ ఆచార్యులు, హుజూర్‌నగర్

దోమలతో విషజ్వరాలు

- మంగళపల్లి గ్రామాన్ని సందర్శించిన డీఎంహెచ్ఓ



మంగళపల్లిలో ఓ ఇంట్లో నీటి నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ కల్యాణ చక్రవర్తి

నకిరేకల్: మురుగు నీరు నిల్వ ఉండి దోమలు విజృంభించడంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారని డీఎంహెచ్ఓ కల్యాణ చక్రవర్తి అన్నారు. మంగళవారం నకిరేకల్ మండలంలోని మంగళపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామంలో మరో రెండు రోజులు వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు. మంగళవారం 50 మందిని పరీక్షించగా 17 మంది జ్వరాల బారిన పడినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా మలేరియా అధికారి దుర్గయ్య, మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, మండల పంచాయతీ అధికారి అత్తార్ పర్వేద్, మండల వైద్యాధికారి, యోగస్వీ ఉన్నారు.

సృజనాత్మకత వెలికితీసేందుకే ఇన్‌స్పైర్ మనక్

- డీఈఓ భిక్షపతి



మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

నల్లగొండ: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇన్‌స్పైర్ మనక్‌లు ఉపయోగపడతాయని డీఈఓ భిక్షపతి అన్నారు. ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకుగాను ఆన్‌లైన్ నామినేషన్ ప్రక్రియపై మంగళవారం నల్లగొండలోని డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల నుంచి సేకరించిన ఐదు ఉత్తమ ఆలోచనలను ఆగస్టు 10లోగా ఇన్‌స్పైర్ యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. సమావేశంలో నవమి ఫౌండేషన్ మేనేజర్ శ్రవణ్, వీరేష్, సైన్స్ అధికారి లక్ష్మీపతి పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- కలెక్టర్ నారాయణరెడ్డి



బ్యాంకులో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నార్కట్‌పల్లి: రుణమాఫీ సమాచారం కోసం బ్యాంకుకు వచ్చిన రైతులను ఇబ్బంది పెట్టొద్దని కలెక్టర్ నారాయణరెడ్డి.అధికారులకు సూచించారు. మంగళవారం ఎస్‌బీఐ నార్కట్‌పల్లి బ్రాంచ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంకుకు వచ్చిన రైతు యాదిరెడ్డితో పాటు పలువురు రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. రుణమాఫీ అయిందా.. అకౌంట్‌లో డబ్బులు పడ్డాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతు రుణమాఫీలో సమస్యలున్నట్లయితే వ్యవసాయాధికారులు, బ్యాంకు మేనేజర్లను సంప్రదించాలని సూచించారు. బ్యాంక్ సిబ్బంది సమాచారం ఇవ్వకుంటే తనకు తెలియజేయాలని చెప్పారు. 2018 డిసెంబర్ నుంచి బ్యాంకుల ద్వారా పొందిన రైతుల రుణాలు మాత్రమే మాఫీ అయినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు రూ.లక్షలోపు రుణాలు మాఫీ అయ్యాయని, మరో పదిహేను రోజుల్లో రూ.లక్షన్నర లోపు రుణాలు మాఫీ అవుతాయని పేర్కొన్నారు. అనంతరం నార్కట్‌పల్లి బ్రాంచ్ ద్వారా రుణమాఫీ అయిన వివరాలను బ్యాంకు మేనేజర్ కమల్‌కాంత్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు విధుల నిర్వహణలో సమయపాలన పాటించటంతో పాటు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. నార్కట్‌పల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, జెడ్పీహెచ్ఎస్‌ను ఆయన సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది హాజరు, మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆస్పత్రికి వస్తున్న రోగుల వివరాలు, అందుతున్న సేవలను డాక్టర్ ఆదిత్యను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు, పాఠశాలలోని సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలో మరమ్మతు పనులను పదిహేను రోజుల్లో పూర్తి చేయాలని, పాఠశాలకు రెండు కంప్యూటర్లు, రెండు టాయిలెట్ గదుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం పాఠశాలలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయన మొక్కలు నాటారు. ఆయన వెంట పీఆర్ ఏఈ మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరుణ్‌కుమార్, సీహెచ్ఓ శ్రీరాములు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

దాతలు ముందుకురావాలి

నల్లగొండ: ప్రభుత్వ విద్య, వైద్యరంగాల్లో పేదలకు కార్పొరేట్ స్థాయిలో సేవలందించేందుకు పారిశ్రామిక వేత్తలు, సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ నారాయణరెడ్డి కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో పారిశ్రామిక సంస్థలు, రైస్ మిల్లర్లు, సంస్థలు, సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని పాఠశాలలను ఎంపిక చేసుకుని ప్రయోగాత్మకంగా కార్పొరేట్ విద్య అందించేందుకు ప్రభుత్వం ముందడుగు వేస్తోందని, ఇందుకు పారిశ్రామిక సంస్థలు, దాతలు సహకారం అందించాలన్నారు. దాతలు కలెక్టర్ పేరున చెక్కులు, డీడీలు అందజేయాలని, ఇచ్చే ప్రతి రూపాయికి జిల్లా యంత్రాంగం బాధ్యత వహిస్తుందని తెలిపారు. సమావేశానికి హాజరైన గెజిటెడ్ అధికారుల సంఘం స్పందించి విద్య, వైద్య రంగాల్లో కార్పొరేట్ సేవలు అందించేందుకు ఒకరోజు వేతనాన్ని విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈమేరకు జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు రాజ్‌కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు ఈ లేఖను కలెక్టర్‌కు అందజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వరరావు, గృహ నిర్మాణ పీడీ రాజకుమార్, హెట్రో, నాట్కో, ఇండియన్ సిమెంట్స్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బెటాలియన్‌ను పరిశీలించిన అదనపు డీజీపీ



మాట్లాడుతున్న సంజయ్‌కుమార్ జైన్

నల్లగొండ క్రైం : అన్నెపర్తి బెటాలియన్‌ను అదనపు డీజీపీ (టీజీ ఎస్పీ) సంజయ్‌కుమార్ జైన్ మంగళవారం పరిశీలించారు. బెటాలియన్‌లో భవన వసతులు, రోడ్లు, నీటి వసతి, చిన్నారుల పార్కు, వాహనాల సామర్థ్యం, శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు సౌకర్యాలను పరిశీలించారు. పరిపాలన భవనాలను పరిశీలించి సమస్యలు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దీంతో సిబ్బంది క్వార్టర్లు వర్షానికి కురుస్తున్నాయని ఆయనకు తెలిపారు. అనంతరం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బెటాలియన్ కమాండెంట్ సత్య శ్రీనివాస్‌రావు, ఎస్పీ శరత్‌చంద్రపవార్, అసిస్టెంట్ కమాండెంట్లు ఆంజనేయరెడ్డి, రవిచంద్ర, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డీఎస్సీ పరీక్షలు

నల్లగొండ: డీఎస్సీ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం జరిగిన పరీక్షకు 174 మంది హాజరు కాగా, 12 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 185 మందికి 169 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరయ్యారు.

చెరువులకు చేపపిల్లలు

- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన మత్స్య శాఖ అధికారులు
- చెరువుల్లో వదలనున్న 5.90 కోట్ల చేపపిల్లలు
- మత్స్యకార కుటుంబాలకు ఉపాధి



నల్లగొండ టూటౌన్: మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు జిల్లాకు 5.90 కోట్ల చేపపిల్లలు కావాలని మత్స్య శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గత ప్రభుత్వ హయాంలో చేపపిల్లల పంపిణీలో చోటుచేసుకున్న అక్రమాల కారణంగా ఈసారి చేప పిల్లల ప్రతిపాదనలను ప్రభుత్వం ఆలస్యంగా తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా డిపార్ట్‌మెంట్ చెరువులు, రిజర్వాయర్లు, గ్రామ పంచాయితీ చెరువులు, కుంటలు 1,160కి పైగానే ఉండగా.. వీటిల్లో మత్స్యకార సొసైటీల ద్వారా చేప పిల్లలను వదలనున్నారు. దీంతో మత్స్యకారుల కుటుంబాలకు ఉపాధి కలగనుంది.

జిల్లాలో 249 మత్స్య సొసైటీలు..

ప్రభుత్వ లెక్కల ప్రకారం జిల్లాలో 249 మత్స్యశాఖ పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో 28వేల మంది మత్స్యకారులు ఉన్నారు. సొసైటీల్లో సభ్యత్వం ఉన్న వారి కుటుంబ సభ్యులను కలుపుకుంటే దాదాపు 60 వేల మందికి పైగా ఉచిత చేప పిల్లల ద్వారా జీవనోపాధి కలిగే అవకాశం ఉంది. గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువులు, కుంటల్లోకి సరిగా నీరు రాకపోవడంతో మత్స్యకారుల ఉపాధిపై ప్రభావం చూపింది.

ప్రతిపాదనలు పంపాం

జిల్లాకు 5.90 కోట్ల చేప పిల్లలు అవసరపడతాయి. వీటి పంపిణీ కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. రాష్ట్ర స్థాయిలోనే టెండర్ల ప్రక్రియ ఆన్‌లైన్‌లో చేపడతారు.

– వెంకయ్య, మత్స్యశాఖ జిల్లా అధికారి

టెండర్ల పొడగింపు

చేప పిల్లలు పంపిణీకి ఆన్‌లైన్ టెండర్లు పిలుస్తారు. ఈ సారి కూడా ఆన్‌లైన్ టెండర్లు పిలిచినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ చేప పిల్లలను పంపిణీ చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. మత్స్యశాఖ ద్వారా జరుగుతున్న ఉచిత చేప పిల్లల పంపిణీలో జరిగిన అక్రమాలపై మూడు, నాలుగు నెలలుగా విచారణలు జరుగుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో చేప పిల్లలు సరఫరా చేసిన కాంట్రాక్టర్లు ఈ సారి మొహం చాటేసినట్లు తెలిసింది. దీంతో టెండర్ల గడువును వచ్చే నెల 2వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించినట్లు అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

బ్యాటరీ పేలి ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం దగ్ధం

చిలుకూరు : చార్జింగ్ అవుతుండగా బ్యాటరీ పేలి ఓ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని రామాపురం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిగురుపాటి నాగేశ్వర్‌రావు తన ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనానికి చార్జింగ్ పెట్టాడు. అది ఎంతసేపటికి చార్జింగ్ కాకపోవడంతో స్విచ్ఛాఫ్ చేశాడు. స్విచ్ఛాఫ్ చేసిన వెంటనే బ్యాటరీ పేలి మంటలు అంటుకున్నాయి. దీంతో వాహనం పూర్తిగా దగ్ధమవ్వడంతో పాటు ఇంటి ఆవరణలోని పలు పరికరాలు కొంతమేరకు దెబ్బతిన్నట్లు బాధితుడు వెల్లడించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

కట్టంగూర్: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన కట్టంగూర్ మండలం కురుమర్తి గ్రామంలో మంగళవారం జరిగింది. కురుమర్తి గ్రామానికి చెందిన గీతకార్మికుడు చెనగోని నాగయ్య రోజుమాదిరిగా మంగళవారం గ్రామ శివారులో తాటిచెట్టు ఎక్కుతుండగా కాలుజారి కింద పడిపోయాడు. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని నాగయ్యను చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాముకాటుతో వలస కూలీ మృతి

కట్టంగూర్ : బతుకుదెరువు కోసం వలస వచ్చిన ఓ కూలీ పాముకాటుతో మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని రాంగనర్‌లో గల పచ్చ రమణమ్మ ఇటుకబట్టీ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం నబరంగాపూర్ జిల్లా దుబుగాన్ మండలం కారగామ్ గ్రామానికి చెందిన శబిలం మానాసింగ్ బిందాని(26) వలస కూలీ ఇటుకబట్టీలో పనిచేసేందుకు వారం రోజుల క్రితం కట్టంగూర్‌కు వచ్చాడు. రోజువారి మాదిరిగా కూలీలు పనులు ముగించుకొని సోమవారం రాత్రి నేలపై నిద్రిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున సుమారు 2.30గంటల సమయంలో మానాసింగ్ పాము కాటుకు గురయ్యాడు. కూలీల ద్వారా విషయం తెలుసుకున్న ఇటుకబట్టీ సూపర్‌వైజర్ వి.జలేందర్ చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం మంగళవారం ఉదయం ఇటుకబట్టీ వద్దకు వచ్చి గదిలో విశ్రాంతి తీసుకుంటున్న మానాసింగ్ నిద్రలోనే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు శబిలం బిందాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ శ్రీను తెలిపారు.

ఆర్‌ఎంపీ వైద్యుడిపై కేసు నమోదు

నాంపల్లి: చికిత్స నిమిత్తం తన వద్దకు వచ్చిన వ్యక్తి మృతికి కారణమైన ఆర్‌ఎంపీ వైద్యుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన పల్లె వెంకటయ్య(42)కు సోమవారం అర్ధరాత్రి ఛాతిలో నొప్పి రావడంతో చికిత్స నిమిత్తం నాంపల్లి మండల కేంద్రంలోని ఆర్‌ఎంపీ వైద్యుడు రాగిఫణి మురళీధరాచారి వద్దకు వెళ్లాడు. వెంకటయ్యకు చికిత్స చేసి తెల్లవారుజామున ఇంటికి వెళ్లమని ఆర్‌ఎంపీ వైద్యుడు సూచించాడు. వెంకటయ్య తన గ్రామానికి వెళ్లగానే ఛాతిలో మళ్లీ తీవ్రనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకురాగా.. మాల్‌కు తీసుకెళ్లమని సూచించాడు. మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెంకటయ్యను తరలించగా.. అప్పటికే అతడు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. వెంకటయ్య మృతికి ఆర్‌ఎంపీ వైద్యుడే కారణమని ఆరోపిస్తూ అతడి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఆర్‌ఎంపీ వైద్యుడి క్లినిక్ ఎదుట ఉంచి ధర్నా చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆర్‌ఎంపి వైద్యుడు మురళీధరాచారిని అరెస్ట్ చేశారు. మృతుడి కుమారుడు పల్లె ఆకాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు. మృతిడికి భార్య, కుమారుడు, కుమారుడు ఉన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి



దేవరకొండ: గొట్టిముక్కల రిజర్వాయర్ వద్ద సీపీఎం నాయకులు



మర్రిగూడ: శివన్నగూడ ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి
- దేవరకొండ నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులను పరిశీలించిన సీపీఎం నాయకులు

దేవరకొండ, డిండి, మర్రిగూడ, నాంపల్లి: దేవరకొండ నియోజకవర్గంలో గల పెండింగ్ ప్రాజెక్టులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన దేవరకొండ మండల పరిధిలోని గొట్టిముక్కల రిజర్వాయర్ నిర్మాణ పనులు, డిండి మండల పరిధిలోని సింగరాజుపల్లి రిజర్వాయర్‌తోపాటు మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టును, మర్రిగూడ మండల పరిధిలోని శివన్నగూడ ప్రాజెక్టు, నాంపల్లి మండలంలోని కిష్టరాయిన్‌పల్లి రిజర్వాయర్ పనులను సీపీఎం రాష్ట్ర కమిటీ బృందం మంగళవారం పరిశీలించింది. రిజర్వాయర్ నిర్మాణ సామర్థ్యం, భూ సేకరణ, ఆర్‌అండ్‌ఆర్ వర్తింపు వంటి విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని కిష్టరాయినిపల్లి, గొట్టిముక్కల, సింగరాజుపల్లి, చింతపల్లి రిజర్వాయర్ల పూర్తికి అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించడంతోపాటు యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని కోరారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా తలపెట్టిన ప్రాజెక్టు నత్తనడకన సాగడానికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌కు ఆమోదం పొందకుండానే ఏర్పాటు చేయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో ఫ్లోరైడ్ భూతాన్ని తరిమివేయడంతో పాటు జిల్లాలో 1.40లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ పనులు పూర్తి చేయకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కిష్టరాయన్‌పల్లి రిజర్వాయర్ భూ నిర్వాసితులకు పూర్తిస్థాయి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, బండ శ్రీశైలం, ప్రమీల, పాలడుగు నాగార్జున, ప్రభావతి, నర్సిరెడ్డి, నల్ల వెంకటయ్య, కంబాలపల్లి ఆనంద్, నాంపల్లి చంద్రమౌళి, ఏర్పుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ ఆత్మహత్య

- కుటుంబ కలహాలతో గడ్డి మందు తాగి బలవన్మరణం



రాజు (ఫైల్)

నల్లగొండ క్రైం: కుటుంబ కలహాలతో సోమవారం సాయంత్రం తన ఇంట్లో గడ్డి మందు తాగిన నల్లగొండ జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ కేతావరపు రాజు(36) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. నల్లగొండ మండలం అప్పాజీపేట గ్రామ పంచాయతీ పరిధిలోని బంటుగూడేనికి చెందిన ఆయన ఇటీవల రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నుంచి బదిలీపై నల్లగొండ అగ్నిమాపక కార్యాలయానికి వచ్చారు. సోమవారం కార్యాలయంలో జాయినింగ్ రిపోర్టు ఇచ్చిన తర్వాత నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని కతాల్‌గూడెం గ్రీన్‌సిటీ కాలనీలో గల తన నివాసానికి వెళ్లి గడ్డి మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. భార్యాభర్తల మధ్య కలహాల కారణంగానే జీవితంపై విరక్తి చెంది తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి కృష్ణయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతుడి భార్య బాబమ్మ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. వారికి ఇద్దరు కుమార్తెలు సంతానం. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మృతి

- బైక్‌పై వెళ్తుండగా ఢీకొట్టిన కారు



రాజు (ఫైల్)

కోదాడరూరల్: బైక్‌పై వెళ్తున్న సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌ను కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ పట్టణంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన చింత రాజు(23) సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం ట్రైనింగ్‌లో ఉన్నాడు. మంగళవారం కోదాడ పట్టణంలోని ఉత్తమ్‌పద్మావతిరెడ్డి కాలనీలో తను నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి క్యూరింగ్ చేసేందుకు నీళ్లు కొట్టి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దాదాపు ఇరవై అడుగుల దూరంలో ఎగిరిపడిన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడు అవివాహితుడు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోదాడ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ప్రస్తుతం లీవ్‌లో ఉన్నట్లు తెలిసింది.

టోల్‌ప్లాజాలను అప్రమత్తం చేసిన పోలీసులు

ప్రమాదానికి కారణమైన కారు ఆపకుండా వెళ్లగా.. కారు నంబర్ ప్లేట్ ఒకటి బైక్‌లో ఇరుక్కుంది. మరొకటి కొద్ది దూరంగా విరిగి పడింది. కారు నంబర్ ఆధారంగా హైదరాబాద్‌కు చెందిన అనుదీప్‌దిగా పోలీసులు గుర్తించారు. కోదాడ పట్టణ పోలీసులు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ వైపు ఉన్న పోలీస్ స్టేషన్లు, టోల్‌ప్లాజాల సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ సమీపంలో చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద కారును గుర్తించి పట్టుకున్నారు. అక్కడి నుంచి కారును కోదాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఇద్దరికి గాయాలు



గాయపడిన కొయిలయ్య



డివైడర్ పైకి ఎక్కి ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

చౌటుప్పల్: లారీని ఓవర్‌టేక్ చేయబోయిన ఆర్టీసీ బస్సు పక్క నుంచి వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని ధర్మోజిగూడెం గ్రామ శివారులో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ డిపోకు చెందిన ఆర్టీసీ డీలక్స్ బస్సు ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి నల్లగొండకు వెళ్తోంది. ఈ క్రమంలో చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామ శివారులోని వినాయకుడి ఆలయం దాటాక ముందున్న లారీని బస్సు ఓవర్‌టేక్ చేయబోయి.. పక్క నుంచి వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా దర్శికి చెందిన తండ్రీ కుమారులు కొయిలయ్య, పాపారావుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాద జరిగిన సమయంలో బస్సు వేగంగా వెళ్లి రోడ్డు పక్కన లారీలు ఆగేందుకు ఏర్పాటు చేసిన లేన్ డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. లేదంటే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండేదని ప్రయాణికులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను వేధించిన కేసులో భర్తకు మూడేళ్ల జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ) : భార్యను వేధించిన కేసులో భర్తకు మూడు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ సెషన్స్ కోర్టు ఎస్. రోజారమణి మంగళవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన జమ్ముల సౌజన్యకు సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలానికి చెందిన వేమూరి నవీన్‌కుమార్‌తో 2014లో ప్రేమ వివాహం జరిగింది. వారికి 2017లో ఓ కూతురు జన్మించింది. నవీన్‌కుమార్ 2017లో మరో యువతితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సౌజన్య నవీన్‌ను నిలదీసింది. అప్పటి నుంచి అతడు వేధింపులకు పాల్పడుతుండడంతో సౌజన్య నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసును విచారించిన పోలీసులు నవీన్‌ను కోర్టులో హాజరుపర్చగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీవాణి వాదనలతో ఏకీభవించిన ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి ఎస్.రోజారమణి నిందితుడికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు..?

- పోలీసుల అదుపులో ఆరుగురు వ్యక్తులు



విచారిస్తున్న విజయపురి టౌన్ ఎస్‌ఐ సంపత్‌గౌడ్, పోలీసులు

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని మత్స్యకారుల కాలనీలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైజాగ్ నుంచి వచ్చిన మత్స్యకారులు నాగార్జునసాగర్ జలాశయ తీరంలో ఇళ్లు నిర్మించుకుని చేపల వేటకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ ఇటీవల నలుగురు అన్నదమ్ములు నూతనంగా ఇళ్లు నిర్మించుకున్నారు. వారిలో ఒకరు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థలో లాంచీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ప్రతి అమావాస్య, ఆదివారం రోజు హైదరాబాద్ నుంచి కొత్త వ్యక్తులు వచ్చి అతడి ఇంట్లో పూజలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత రెండు నెలలుగా వైబ్రేటర్లను ఉపయోగించి ఆ ఇంట్లో 15అడుగుల లోతు గుంత తవ్వగా.. పెద్దపెద్ద శబ్దాలు వస్తుండడంతో చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురై పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మంగళవారం స్థానిక పోలీసులు మత్స్యకారుల కాలనీకి వెళ్లి అన్నదమ్ములను విచారించగా.. తమ ఇంట్లో గజ్జెల చప్పుడు వస్తుందని, తవ్వకాలు జరిపితే ఎల్లమ్మ తల్లి బయటకు వస్తుందని గుంత తవ్వినట్లు చెప్పారు. మరోసారి అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయని విడివిడిగా ఉండేందుకు గాను మరుగుదొడ్డి నిర్మాణానికి గుంత తవ్వుతున్నట్లు చెప్పారు. 10అడుగులున్న గదిలో మొత్తం గుంత తవ్వడంతో మరుగుదొడ్డి నిర్మాణం ఎక్కడ చేస్తారని పోలీసులు వారిని ప్రశ్నించగా.. పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురి టౌన్ ఎస్‌ఐ సంపత్‌గౌడ్ తెలిపారు. పోలీసుల అదుపులో తవ్వకాలు జరిపిన ఇంటి యజమానితో పాటు అతడి అన్నదమ్ములు, మంత్రగాళ్లు ఉన్నట్లు సమాచారం.

తీగలాగితే డొంక కదిలే అవకాశం..

గతంలో నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో గుట్టపై గల ఏలేశ్వర మల్లికార్జునస్వామి ఆలయంలో గుప్తనిధుల కోసం కొందరు తవ్వకాలు జరిపారు. అదేవిధంగా ఇటీవల పెద్దవూర మండలం పోతునూరు గ్రామం సమీపంలో, దేవరకొండ ఖిలాపై, తిరుమలగిరి(సాగర్) మండలం నెల్లికల్లు గ్రామంలోని పాడుబడిన దేవాలయంలో తవ్వకాలు జరిపారు. గతంలో బీఎస్‌ఎన్‌ఎల్‌లో పనిచేసే ఓ ఉద్యోగి, ప్రభుత్వ పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేసిన ఉద్యోగి, మరికొందరు కలిసి ముఠాగా ఏర్పడి గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపేవారని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పోలీసులు విచారణ జరిపితే ఇంకా చాలా విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

గంజాయి పట్టివేత

- నిందితుడి నుంచి కేజీ గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట డీఎస్పీ రవి



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ రవి

సూర్యాపేటరూరల్: గంజాయి విక్రయించేందుకు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి కేజీ గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట డీఎస్పీ రవి మంగళవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం పెన్‌పహాడ్ ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి సింగారెడ్డిపాలెం గ్రామ శివారులో బోసుకుంట చెరువు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామానికి చెందిన బొమ్మకంటి గోపి బైక్‌పై సూర్యాపేట వైపు వెళ్తున్నాడు. గోపిని పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా అతడు బైక్ ఆపకుండా వెళ్లిపోయాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతడిని వెంబడించి పట్టుకొని బైక్ పెట్రోల్ ట్యాంక్ కవర్‌లో దాచిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించగా.. తన స్నేహితుడైన చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన గుండు గోపితో కలిసి జూన్ 29న ఆంధ్రా–ఒరిస్సా రాష్ట్రాల సరిహద్దులో బాప అనే వ్యక్తి వద్ద కేజీ గంజాయి రూ.2000 చొప్పున రెండు కేజీలు కొనుగోలు చేసి సూర్యాపేటకు తీసుకొచ్చి చెరో కిలో చొప్పున పంచుకున్నట్లు తెలిపాడు. తన వద్ద ఉన్న గంజాయిని బొమ్మకంటి గోపి సూర్యాపేటకు తీసుకెళ్లి విక్రయిద్దామని వెళ్తుండగా పెన్‌పహాడ్ పోలీసులు పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడి వద్ద కేజీ గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గుండు గోపిని కూడా చిలుకూరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన పెన్‌పహాడ్ ఎస్‌ఐ రవీందర్, ఏఎస్‌ఐ వెంకటరత్నం, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లింగరాజు, రామాజంనేయులను డీఎస్పీ అభినందించారు.

హైనా దాడిలో గేదె దూడలు మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సరిత

డిండి: హైనా దాడిలో రెండు గేదె దూడలు మృతిచెందాయి. ఈ ఘటన మంగళవారం డిండి మండలం కొత్తతండాలో జరిగింది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సరిత తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తతండాకు చెందిన పాత్లావత్ పాండు గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో సోమవారం సాయంత్రం రెండు గేదె దూడలను కట్టేసి ఉంచాడు. సోమవారం ఉదయం పాండు పొలం దగ్గరకు వెళ్లగా అప్పటి వరకే దూడలు మృతిచెంది ఉండటంతో ఫారెస్ట్ అధికారులకు సమాచార ఇచ్చాడు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. గేదె దూడలపై హైనా దాడి చేసినట్లు గుర్తించామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సరిత తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని గొల్లగూడకు చెందిన కత్తుల నర్సింహ(45) సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం వర్కర్ల కోసం బైక్‌పై తిప్పర్తి మండలం అనిశెట్టిదుప్పలపల్లికి వెళ్తుండగా కేశరాజుపల్లి హ్యాపీ హోమ్స్ సమీపంలో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నర్సింహకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడు. నర్సింహ కుమారుడు చందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తిప్పర్తి ఎస్‌ఐ డి. రాజు తెలిపారు.

కారు ఢీకొని వృద్ధురాలు..

కనగల్: కారు ఢీకొని గాయాలపాలైన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. కనగల్ ఎస్‌ఐ రామకృష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం బచ్చన్నగూడెం గ్రామానికి చెందిన పర్సన బోయిన లక్ష్మమ్మ(68) సోమవారం మధ్యాహ్నం జి. యడవల్లి గ్రామ సమీపంలోని ప్రధాన రహదారి వెంట నడుచుకుంటూ తన వ్యవసాయ భూమికి వెళ్తుండగా.. వెనుక నుంచి కారు వచ్చి ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మమ్మకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. గుడిపల్లి మండలం భీమనపల్లి గ్రామానికి చెందిన కారు డ్రైవర్ పారుపాక దిలీప్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి కుమారుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నూకల లోడ్ లారీ తనిఖీ

మేళ్లచెరువు : మండల పోలీసులు తనిఖీల్లో భాగంగా సోమవారం రాత్రి బియ్యం లోడ్‌తో ఓ లారీ వెళ్తున్నట్లు అనుమానంతో పట్టుకున్నారు. వెంటనే ఆ లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా లారీలోడ్ రేషన్ బియ్యమా కాదా అని నిర్ధారణ చేసేందుకు సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించారు. మంగళవారం వారు వచ్చి లారీలో ఉన్న సరుకును శాంపిల్‌లు సేకరించి మాట్లాడారు. అవి రేషన్ బియ్యం కాదని సన్ననూకలని గుర్తించారు. లారీ మేళ్లచెరువులోని శ్రీనివాస పార్‌బాయిల్డ్ రైస్‌మిల్ నుంచి కల్వకుర్తిలోని శ్రీఆంజనేయ ట్రేడర్స్ అనే బీరు తయారీ కంపెనీకి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలో సివిల్ సప్లయ్ డీటీ రాజశేఖర్, క్వాలిటీ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐ పరమేష్ ఉన్నారు.

మూడు ఇళ్లలో చోరీ

చింతపల్లి: మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లో మూడు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం చోరీకి పాల్పడ్డారు. ఎస్‌ఐ యాదయ్య తెలిపిన ప్రకారం.. దేవరకొండకు చెందిన మల్లోజు విష్ణు ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తూ మాల్ వెంకటేశ్వరనగర్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి విష్ణు డ్యూటీకి వెళ్లగా అతడి భార్య ఇంటికి తాళాలు వేసి సమీపంలోని ఆమె కుమార్తె ఇంటికి వెళ్లింది. గుర్తుతెలియని వ్యక్తులు విష్ణు ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలో ఉన్న తులం బంగారం, 12 తులాల వెండిని దొంగలించారు. ఇంటికి సమీపంలో ఉన్న మరో రెండు ఇళ్లల్లో కూడా దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. సీసీ ఫుటేజీ పరిశీలించి, దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుట్కా ప్యాకెట్లు పట్టివేత

పాలకవీడు: మండల పరిధిలోని మహంకాళిగూడెం వద్ద గల డెక్కన్ సిమెంట్ పరిశ్రమలోని ఓ కిరాణ దుకాణంలో మంగళవారం పోలీసులు భారీగా గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. డెక్కన్ సిమెంట్ పరిశ్రమలోని కిరాణ దుకాణంలో గుట్కాలు అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు ఆ దుకాణాన్ని తనిఖీ చేసి రూ.11వేల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు దుకాణ యజమానిపై కేసు నమోదు చేసి ని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేనేత పరిరక్షణ ర్యాలీని జయప్రదం చేయాలి




మహా ర్యాలీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టై అండ్ డై అసోసియేషన్ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి: చేనేత ఇక్కత్ ప్రింటింగ్ వస్త్రాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న చేనేత పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో చేపట్టనున్న మహా ర్యాలీని జయప్రదం చేయాలని పోచంపల్లి టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం పోచంపల్లి పట్టణ కేంద్రంలోని సంఘం భవనంలో మహా ర్యాలీ కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పోచంపల్లి పట్టణ కేంద్రంలోని నేతన్న విగ్రహం నుంచి ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. మాస్టర్ వీవర్స్, వస్త్ర వ్యాపారులు, చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. వారసత్వంగా వస్తున్న చేనేత ఇక్కత్ కళకు ప్రభుత్వం భౌగోళిక గుర్తింపు ఇచ్చిందని అన్నారు. కానీ మిల్లుల్లో ఇక్కత్ డిజైన్లు కల్గిన డూప్లికేట్ వస్త్రాలు తయారు చేసి షాపింగ్‌మాల్స్, దుకాణాలలో అతి తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో చేనేత కార్మికుల ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. డూప్లికేట్ చీరలను అరికట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కర్నాటి బాలరాజు, పద్మశాలీ చేనేత కార్మిక సంఘం అధ్యక్షురాలు మెరుగు శశికళ, చేనేత చీరల ఉత్పత్తిదారుల సంఘం ఉపాధ్యక్షుడు పాలాది యాదగిరి, చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేశ్, జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం, సిల్క్‌యారన్ మర్చంట్ అధ్యక్షుడు సూరెపల్లి రవీందర్, ఏకేఎల్‌బీ అసోసియేషన్ అధ్యక్షుడు గుండు శ్రీరాములు, ఏర్వ నీలమ్మ, మంగళపల్లి రమేశ్, గంజి బాలరాజు, వనం దశరథ, సీత భవానీ, శంకర్, కందగట్ల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ తప్పిదాలతోనే భూ సమస్యలు

- రాజ్యసభ మాజీ సభ్యుడు వి. హనుమంతరావు



నడిగూడెం: బాధితురాలు లక్ష్మమ్మను పరామర్శిస్తున్న వి. హనుమంతరావు

భానుపురి (సూర్యాపేట): గత ప్రభుత్వం అవలంబించిన తప్పుడు విధానాలతోనే రాష్ట్రంలో అనేక మంది రైతులు, సామాన్య ప్రజలు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని రాజ్యసభ మాజీ సభ్యుడు వి. హనుమంతరావు అన్నారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన రైతు మేడం ముత్తయ్యకు వారసత్వంగా వచ్చిన భూమిని ఇతరులు కబ్జా చేయడం బాధాకరమన్నారు. రైతుకు వచ్చిన భూ సమస్య విషయంలో అప్పటి రెవెన్యూ అధికారులదే పూర్తి తప్పిదమని తెలిపారు. బాధితుల నుంచి వివరాలు తెలుసుకునేందుకు తాను గ్రామానికి వెళ్లానని, వారితో మాట్లాడానని చెప్పారు. ధరణి లోపాలను అడ్డు పెట్టుకొని గత పాలకులు, అధికారులు ఎన్నో పొరపాట్లు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు పట్టాదారులను కాదని అనర్హులకు భూమి పట్టా చేశారని అన్నారు. ధరణిని పూర్తి ప్రక్షాళన చేయ్యాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు. గతంలో పటేల్ పట్వారీ వ్యవస్థ గ్రామాల్లో ఉన్నప్పుడు ఇలాంటి భూ సమస్యలు లేవని, ఆ వ్యవస్థ రద్దు కావడం, ధరణి రావడంతో అనేక భూ సమస్యలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, నాయకులు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు..

నడిగూడెం: మండలంలోని రామాపురం గ్రామానికి మంగళవారం వి. హనుమంతరావు వెళ్లి సూర్యాపేట కలెక్టరేట్‌లో సోమవారం ఆత్మహత్యాయత్నం చేసిన మేడం ముత్తయ్య కుటుంబ సభ్యులు మేడం లక్ష్మమ్మ, పుల్లమ్మ, అరుణను పరామర్శించారు. భూ సమస్యలుంటే అధికారుల సమక్షంలో పరిష్కరించుకోవాలి తప్ప.. ఆత్మహత్యలకు పాల్పడొవద్దని వారికి ధైర్యం చెప్పారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో బాధితులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.